# బ్యాంకుల్లో పైసల్లేవ్

## నానాటికీ తగ్గుతున్న డిపాజిట్లు

**మారిన సగటు మదుపరి పొదుపు ● ఫండ్లవైపే భారతీయుల చూపు**




న్యూఢిల్లీ, అక్టోబర్ 7: దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థకు పెద్ద కష్టమే వచ్చిపడింది. డిపాజిట్లు లేక ద్రవ్యలభ్యత కరువైపోయింది మరి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన పరిశోధనాత్మక నివేదిక.. భారతీయ బ్యాంకులు ఎదుర్కొంటున్న నగదు కొరత, పడిపోతున్న డిపాజిట్లకు అద్దం పడుతున్నది.

**రూ.0.95 లక్షల కోట్లకు పతనం**

దేశీయ బ్యాంకుల్లో నగదు లభ్యత గరిష్ఠంగా రూ.2.86 లక్షల కోట్ల నుంచి రూ.0.95 లక్షల కోట్ల కనిష్ఠానికి దిగజారినట్టు యూనియన్ బ్యాంక్ రిసెర్చ్ రిపోర్టు చెప్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో బ్యాంకులకు దిశా-నిర్దేశం చేసినప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు కనిపించకపోవడం గమనార్హం. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. పదేపదే బ్యాంకుల్లో తరిగిపోతున్న ద్రవ్యలభ్యతపై హెచ్చరికలు చేశారు. చివరకు ఆర్బీఐ కూడా డిపాజిట్ల వృద్ధిపై బ్యాంకులు దృష్టి పెట్టాలని, లేకపోతే సమస్యలు తప్పవని హెచ్చరించింది. ఈ ఏడాది ఆగస్టు 2న బ్యాంకుల్లో రూ.2.56 లక్షల కోట్లుగా ఉన్న ద్రవ్య లభ్యత.. 16న రూ.1.55 లక్షల కోట్లకు పడిపోయింది. 28న ఇది రూ.0.95 లక్షల కోట్లకు దిగజారింది.

**ఇదీ సంగతి..**

బ్యాంకుల్లో ఎఫ్‌డీ అంటే సురక్షితమైన పెట్టుబడి. గృహస్తులు, సీనియర్ సిటిజన్లు, ఇన్వెస్టర్ల ఆసక్తి ఎఫ్‌డీలపైనే. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. రిస్క్ ఉన్నప్పటికీ అధిక రాబడులనిచ్చే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపైనే దేశీయ మదుపరుల చూపు పడుతున్నది. మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్‌లోకి గృహస్తులు తమ సేవింగ్స్‌ను పెద్ద ఎత్తున తరలిస్తున్నారని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా చెప్పారు. ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. వీటితో పోల్చితే స్టాక్ మార్కెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల్లో 2-3 రెట్లు రాబడులు ఎక్కువగా వస్తుండటంతో అంతా ఆవైపే వెళ్తున్నారు. కానీ మార్కెట్లు నష్టపోతే ఇన్వెస్టర్లకూ నష్టాలు తప్పడం లేదు. అయినప్పటికీ ఓవరాల్‌గా లాభాలే కనిపిస్తుండటంతో అంతా ఎఫ్‌డీలకు బదులుగా మ్యూచువల్ ఫండ్లకే ప్రాధాన్యతనిస్తున్నట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**కఠిన చర్యలున్నా..**

హై రిస్క్‌తో కూడిన పెట్టుబడుల వైపే దేశంలోని రిటైల్ ఇన్వెస్టర్లు అడుగులు వేస్తుండటంతో మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. ఈ పోకడకు బ్రేకులు వేసేందుకు కఠిన చర్యల్నే చేపడుతున్నది. ముఖ్యంగా ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌వో) ట్రేడింగ్‌లో పెట్టుబడులపట్ల నిబంధనల్ని కఠినతరం చేసింది. అయితే డిపాజిటర్లను ఆకర్షించేందుకు బ్యాంకులు కూడా వడ్డీరేట్లను పెంచాలన్న అభిప్రాయాలు వస్తున్నాయి. కానీ అదే జరిగితే రుణాలపై వడ్డీరేట్లనూ పెంచాల్సి వస్తుందని బ్యాంకర్లు బదులిస్తున్నారు.

## ఆవిష్కరణలకు ఏఐ ఉత్ప్రేరకం

### రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
### మార్కెట్‌లోకి బీసీఎస్ నూతన ఉత్పత్తులు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న బ్లూ క్లౌడ్ సాఫ్ట్ టెక్ (బీసీఎస్).. సోమవారం నాలుగు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇందులో బ్లూహెల్త్ యాప్, బ్లూరా, ఎడ్యు జెనీ, బయోస్టర్ ఉన్నాయి. ఈ వినూత్న ఉత్పత్తులను హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతీ రంగంలోనూ కొత్త ఆవిష్కరణలకు ఉత్ప్రేరకంగా ఏఐ నిలుస్తున్నదని, ఆరోగ్య సంరక్షణలో ఏఐ అంటే జీవితాలను మార్చగలిగిన శక్తి అన్నారు. ప్రభుత్వ మాజీ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా, బీసీఎస్ చైర్‌పర్సన్ జానకి యార్లగడ్డలు పాల్గొన్నారు.

## తెలంగాణకు ఎస్‌జీ గ్రూప్!



సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడుతున్న ఎస్‌జీ గ్రూప్, పీఎస్‌ఆర్ గ్రూప్ ఎండీలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఈవీల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఎస్‌జీ గ్రూప్ ఆసక్తి చూపుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం ఎస్‌జీ గ్రూప్ ఎండీ యోగేష్ భాటియా, పీఎస్‌ఆర్ గ్రూప్ ఎండీ శ్రీరంగారావులు సచివాలయంలో మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రూ.3వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు యోగేష్ భాటియా ముందుకొచ్చారని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. తద్వారా 1,000 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అంతకుముందు రాష్ట్రంలో ఈవీల ఉత్పత్తికున్న అనుకూలతల్ని మంత్రి భాటియాకు వివరించారు. పెట్టుబడులు పెడితే అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై భాటియా సానుకూలంగా స్పందించారు.

## ఏఐపీఎంఏ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 7: ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి వెన్నం నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో ఏడాదిపాటు కొనసాగనున్నారు. రూ.3.5 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న ప్లాస్టిక్ పరిశ్రమలో తొలిసారిగా తెలుగువారికి ఉన్నత పదవి వరించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఏఐపీఎంఏకి 175 నగరాల్లో 22 వేలకు పైగా సభ్యులు ఉన్నారని, వీరిలో 90 శాతం మంది ఎంఎస్ఎంఈ రంగానికి చెందినవారేనని ఈ సందర్భంగా అనిల్ రెడ్డి తెలిపారు.



## ఏఏఏఐ డైరెక్టర్‌గా మళ్లీ కే శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబర్ 7: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఏఏఐ) డైరెక్టర్‌గా తిరిగి స్లోకా అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో కే శ్రీనివాస్ నియమితులయ్యారు. ప్రకటనలు, మార్కెటింగ్ రంగంలో శ్రీనివాస్‌కు మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్నది. శ్రీనివాస్ మాట్లాడుతూ..ఈ ప్రతిష్ఠాత్మక సంఘం బోర్డు డైరెక్టర్‌గా మళ్లీ ఎంపికకావడం చాలా సంతోషంగా ఉన్నదని, ఇదో గొప్ప అవకాశం, బాధ్యత అన్నారు.

# 9 లక్షల కోట్లు ఆవిరి

## వరుస నష్టాల్లో మదుపరులకు పెద్ద దెబ్బ

### ఆరు సెషన్లలో 5,100 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబై, అక్టోబర్ 7: వరుసగా ఆరో రోజూ కూడా దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లలో అమ్మకాలు పోటెత్తడం, అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోవడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. ఒక దశలో వెయ్యి పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ ఇంట్రాడేలో 81 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు 638.45 పాయింట్లు నష్టపోయి 81,050 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 218.85 పాయింట్లు కోల్పోయి 25 వేల కీలక మైలురాయిని కోల్పోయింది. చివరకు 24,795.75 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరుల సంపద లక్షల కోట్ల స్థాయిలో కరిగిపోయింది. వరుసగా ఆరు సెషన్లలో సెన్సెక్స్ 4,521.85 పాయింట్లు లేదా 5.28 శాతం నష్టపోవడంతో మదుపరులు ఏకంగా రూ.9 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీ మార్కెట్ విలువ రూ.8,90,153.84 కోట్లు కరిగిపోయి రూ.4,51,99,444.70 కోట్ల(5.38 ట్రిలియన్ డాలర్లు) వద్దకు పడిపోయింది. అంతకుముందు రూ.4,60,89,598.54 కోట్లు (రూ.5.49 ట్రిలియన్ డాలర్లు) గా ఉన్నది.

- అదానీపోర్ట్స్ 4.17 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- ఎన్టీపీసీ, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్‌లు రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి.
- అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, కొటక్ బ్యాంక్, నెస్లె, ఎల్‌అండ్‌టీ, మారుతి, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, టాటా మోటర్స్ షేర్లు కూడా పతనం చెందాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా 1.46 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా యుటిలిటీ రంగ షేర్లు అత్యధికంగా 3.63 శాతం నష్టపోగా, పవర్ 3.14 శాతం, సర్వీసులు 3.12 శాతం, కమోడిటీస్ 2.54 శాతం, టెలికం 2.49 శాతం, ఎనర్జీ 2.46 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.38 శాతం చొప్పున నష్టపోయాయి.
- కానీ, ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు కదంతొక్కడంతో సూచీల భారీ నష్టాలు తగ్గించుకోగలిగింది.
- సర్వీసు క్వాలిటీ విషయంలో అభ్యంతరాలు వ్యక్తంకావడంతో ఓలా షేరు 8 శాతం నష్టపోయి రూ.90.82 వద్ద నిలిచింది.

### బంగారం మరింత పైకి

బంగారం ధరలు మళ్లీ భగ్గుమంటున్నది. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు ప్రస్తుత పండుగ సీజన్‌లో ఆభరణాల కొనుగోళ్లు ఊపందుకోవడంతో దేశీయంగా ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఇదే క్రమంలో సోమవారం కూడా ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.250 అధికమై రూ.78,700 పలికింది. కానీ, వెండి ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి ధర రూ.200 దిగొచ్చి రూ.94,200 నుంచి రూ.94,200కి దిగినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,671.50 డాలర్ల వద్ద, వెండి 32.20 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.



బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్‌ను నియమించుకున్నది. ఈ సందర్భంగా సచిన్‌తో బీవోబీ ఎండీ, సీఈవో దేబదత్త చంద్

## లాట్ మొబైల్స్‌లో దసరా-దీపావళి ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 7: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల రిటైల్ విక్రయ సంస్థ లాట్ మొబైల్స్ 12వ వార్షికోత్సవంతోపాటు దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకొని వినూత్న ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్మార్ట్ టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేసినవారికి కనీ వినీ ఎరుగని విధంగా 9 ఆఫర్లను ప్రకటించినట్లు కంపెనీ డైరెక్టర్ ఎం అఖిల్ తెలిపారు. ఈ ఆఫర్లులో రూ.9,999 వరకు కొనుగోలు చేసే ప్రతిదానిపై ఖచ్చితమైన బహుమతితోపాటు స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్, ఏసీలపై 40 శాతం వరకు తగ్గింపు ఆఫర్‌తోపాటు 10 శాతం తక్షణ నగదు వాపస్, ఎలాంటి ముందస్తు చెల్లింపులు జరపకుండానే నో కాస్ట్ ఈఎంఐ స్కీం, ఎస్బీఐ క్రెడిట్ కార్డుపై 5 శాతం వరకు తక్షణ తగ్గింపు, బ్యాండెడ్ యాక్సెసిరీస్‌పై 80 శాతం వరకు తగ్గింపు, ఒప్పో ఫోన్లపై లక్కీ డ్రా ద్వారా రూ.10 లక్షల నగదు, ఎంఐ, రియల్‌మీ మొబైళ్లపై లక్కీ డ్రాలో కార్లు, బైక్స్, మరెన్నో బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పించింది.




## మార్కెట్‌కు నాలుగు రోజుల సెలవు

కాశీబుగ్గ, అక్టోబర్ 7: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు ఇస్తున్నట్లు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. 10న దుర్గాష్టమి, 11న మహార్నవమి, 12న విజయదశమి, 13న ఆదివారం వారంతపు సెలవు ఇస్తున్నట్లు తెలిపారు. 14వ తేదీ నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరుగుతాయన్నారు. నాణ్యతగల వ్యవసాయ ఉత్పత్తులు తీసుకొచ్చి గిట్టుబాటు ధరలు పొందాలని సూచించారు.

## రంగుమారిన తాగునీరు

వరంగల్, అక్టోబర్ 7 : ప్రతి ఇంటికి రక్షిత తాగునీరు సరఫరా చేస్తామన్న బల్దియా అధికారులు రంగు మారిన నీటిని సరఫరా చేస్తున్నారు. సీజనల్ వ్యాధులతో ఆస్పత్రుల పాలవుతున్న నగర ప్రజలు ఆ నీటిని తాగేందుకు భయపడుతున్నారు. దేశాయిపేట ఫిల్టర్ బెడ్ పరిధిలో వరంగల్ ప్రాంతంలో రెండు రోజులుగా ఆకుపచ్చ రంగులో తాగునీరు సరఫరా అవుతోంది. మేయర్ గుండు సుధారాణి నివాసం ఉండే డివిజన్‌లో రంగుమారిన తాగునీరు సరఫరా కావడం గమనార్హం.

**అధికారులది అదే నిర్లక్ష్యం**

మేయర్ నాలుగు రోజుల క్రితం దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌ను తనిఖీ చేసి రంగు మారిన తాగునీరు సరఫరా అవుతున్న విషయంపై అధికారులతో చర్చించారు. ధర్మసాగర్ రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరు రంగు మారిందని అధికారులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ధర్మసాగర్ రిజర్వాయర్‌లో రసాయనాలు వేసి శుద్ధి చేస్తున్నామని, దేశాయిపేట ఫిల్టర్ బెడ్‌లో సైతం తాగునీటి శుద్ధిని సమర్థంగా నిర్వహించాలని మేయర్ అధికారులను ఆదేశించారు. అయినా వారి తీరు మారలేదు. రెండు రోజులుగా వరంగల్ ప్రాంతంలో ఆకుపచ్చ రంగు నీటిని సరఫరా చేస్తున్నారు.

## నేడు బల్దియాలో బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ సంబురాలకు బల్దియా ముస్తాబవుతోంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రధాన కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా ఉద్యోగులు సంబురాలలో పాల్గొనాలని ఆమె కోరారు.

## చేపల మార్కెట్లు నిర్మించాలని ధర్నా

వరంగల్, అక్టోబర్ 7 : పది లక్షల జనాభా కలిగిన వరంగల్ మహానగరంలో చేపలు విక్రయించేందుకు మార్కెట్లు లేవని తక్షణమే కార్పొరేషన్ అధికారులు చేపల మార్కెట్లు నిర్మించాలని తెలంగాణ మత్స్యకారుల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం కార్పొరేషన్ ఎదుట మత్స్యకారులు ధర్నా చేశారు. నగరంలో చేపలు రోడ్డు పక్కన విక్రయించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో 10 ఎకరాల స్థలంలో రూ.50కోట్లతో హోల్‌సేల్ మార్కెట్‌తో పాటు నగరంలో ప్రత్యేకంగా చేపల మార్కెట్లు నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల విజేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్, నాయకులు జనగరి దుర్గయ్య, పిట్టల రవి, శ్రీలత, దుప్ప సమ్మక్క, రమేశ్‌బాబు, శ్రీకాంత్, పోలు వనమ్మ, సాగర్, రజిత పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

నర్సంపేట/ ఖిలావరంగల్ /మట్టెవాడ, అక్టోబర్ 7: జిల్లాలో పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు చేసి పెద్ద సంఖ్యలో పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. నర్సంపేట మండల కేంద్రంలోని శాంతినగర్‌లోని వీరసరపు కాంతమ్మ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రాగా ఎస్సై రవికుమార్, ట్రైనీ ఎస్సై దిలీప్ సిబ్బందితో దాడి చేశారు. చెన్నారపు మహేందర్, నాతి సదానందం, రేకుల అనిల్, నాసు రాకేశ్, కోట రమేశ్, వీరసరపు కాంతమ్మను అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.6,440 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమణమూర్తి తెలిపారు. ఖిలావరంగల్ క్రిస్టియన్ కాలనీలో పేకాడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సీఐ సార్ల రాజు, ఆర్ఎస్ఐ భానుప్రకాశ్ సిబ్బందితో దాడి చేశారు. కీర్తినగర్‌కు చెందిన హమాలీ గండ్రకోట శ్రీను, క్రిస్టియన్ కాలనీకి చెందిన వ్యాపారి బోనాల సామెల్, నోముల ప్రదీప్, ఒక్కుల వినయ్‌ను అదుపులోకి తీసుకొని, వీరి వద్ద నుంచి రూ.13,040 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట శిబిరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పలువురిని అరెస్ట్ చేసిసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ తెలిపారు. గుండె దిగంబర్, కోట వర్ధన్, కటకం ప్రశాంత్, జన్ను కిరణ్, తాళ్ల రాకేశ్, బీరెల్లి రాజు ఉన్నారు. వీరి నుంచి రూ.8,460 నగదు స్వాధీనం చేసుకుని, మట్టెవాడ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

# గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో జాప్యం తగదు

**గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే**

వరంగల్, అక్టోబర్ 7 : బల్దియా గ్రీవెన్స్‌లో బాధితులు అందజేసిన వినతుల పరిష్కారంలో జాప్యం తగదని, సత్వరమే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కమిషనర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కాశీబుగ్గ మాధురీనగర్ రోడ్ నంబర్ 3లో రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. 43వ డివిజన్ గవిచర్ల క్రాస్ రోడ్‌లో ఫ్లోరైడ్ వాటర్‌తో ఇబ్బందులు పడుతున్నామని, మిషన్ భగీరథ పైప్‌లైన్ వేయాలని స్థానికులు అధికారులను కోరారు. పుప్పాల గుట్ట ప్రాంతంతో కుక్కల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు కమిషనర్‌కు విన్నవించారు. 65వ డివిజన్ చింతగట్టు ప్రాంతంలోని శ్మశాన వాటికలో కనీస వసతులు లేవని, దహన సంస్కారాలు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. మడికొండలోని ఎస్సీ, బీసీ కాలనీలోని పార్కు, కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన సర్వే నంబర్ 1631లోని 770గజాల స్థలం ఆక్రమణకు గురైందని కాలనీవాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రీవెన్స్‌లో 70వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 33, ఇంజినీరింగ్ విభాగం 17, ప్రజారోగ్య విభాగం 9, పన్నుల విభాగం 8, ఎలక్ట్రికల్ విభాగం 1, హార్టికల్చర్ 2 వినతులు వచ్చాయి. ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో రాజిరెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాదేకర్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హెచ్‌వో రమేశ్, టీపీఆర్వో కోలా రాజేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ట్యాక్సేషన్ అధికారి బిర్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను వేగంగా పూర్తి చేయాలి**

ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని గ్రేటర్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. బాలసముద్రం, పోతన నగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివిధ డివిజన్ల నుంచి స్వచ్ఛ ఆటోలు ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు వచ్చేందుకు ఎంత సమయం పడుతుంది.. ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నుంచి రాంపూర్ డంపింగ్ యార్డుకు ఎంత సమయం పడుతుందని అడిగి తెలుసుకున్నారు. పోతన నగర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నుంచి చెత్త తరలింపు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఈ సారంగం, ఏఈ సంతోష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.



హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న పార్టీల నేతలు

## పాలస్తీనాపై దాడులను నిలిపివేయాలి

**వామపక్షాల ఆధ్వర్యంలో వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో ధర్నా**

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 7: పాలస్తీనా ప్రజలకు ఇజ్రాయెల్ దాడులను నిలిపివేయాలని కోరుతూ సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐ(యూ), సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ఎస్‌యూసీఐ, ఆర్ఎస్‌పీ, ఫార్వడ్ బ్లాక్ పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ.. ప్రపంచ శాంతికి అన్ని దేశాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద విధానానికి, అమెరికా, ఇజ్రామెల్ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఐక్యప్రజా ఉద్యమాలు చేపడతామనారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు రాచర్ల బాలరాజు, బండి కోటేశ్వర్‌రావు, మేకల రవి, సీహెచ్ రంగయ్య, గోనె కుమారస్వామి, అక్కెనపల్లి యాదగిరి, గంగాధర్, వల్లందాస్ కుమార్, నవీద్ హకీం, నర్రా ప్రతాప్, జీ రమేశ్, ఏ రాజేందర్, ఎస్ జగదీశ్, ఎండీ బషీర్, సత్యనారాయణ, ఏ కుమార్, పీ ప్రసాద్ పాల్గొన్నారు.

## బిల్లుల్లేవ్.. భోజనం పెట్టేదెలా?

- **ఎనిమిది నెలలుగా డైట్ కాంట్రాక్టర్ల ఇబ్బందులు**
- **కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో రోగులకు అందని పౌష్టికాహారం**

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 7 : అనారోగ్య సమస్యలతో దవాఖానలో చేరిన రోగులకు పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాటైన డైట్ వ్యవస్థను కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం చేస్తోంది. ఎనిమిది నెలలుగా బిల్లులు మంజూరు చేయకపోవడంతో డైట్ కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సేవలందిస్తున్న సీకేఎం హాస్పిటల్‌కు సుమారు రూ.35 లక్షలు, ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు రూ.15 లక్షలు, ఎంజీఎం హాస్పిటల్‌కు రూ.3 కోట్లపైగా బిల్లులు నిలిచిపోయినట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రజావైద్యానికి పెద్దపీట నాణ్యమైన సేవలందించడంతో ప్రజల్లో సర్కారీ వైద్యంపై నమ్మకం పెరిగి ఆశ్రయిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తోంది. బిల్లులు నిలిపివేసి ఇబ్బందులకు గురిచేస్తున్నదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని బిల్లులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు

## కాస్తులో ఉన్న భూమిని లాక్కునే యత్నం

**తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా**

నెక్కొండ, అక్టోబర్ 7: నలభై ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూమిని అధికార పార్టీ నాయకులు తమదంటూ లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని నెక్కొండ మండలం తోపనపల్లికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాధిత రైతుల భూములు వెంకటాపురం శివారులో ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డికి సంబంధించిన కొందరు అనుచరులు తమ భూములపైకి వచ్చి తమదంటున్నారని తెలిపారు. కొన్నేళ్లక్రితం వీఆర్‌వోగా పనిచేసిన సాయిరెడ్డిపల్లెకు చెందిన మద్ది వెంకట్‌రెడ్డి ఈ భూములు తమవేనంటూ రంజిత్‌రెడ్డికి అమ్మినట్లు చెబుతున్నారన్నారు. వాస్తవంగా తమ భూములను ఎవరికీ విక్రయించలేదని, అయినా వారికున్న పరపతితో కొందరు తమపై ఒత్తిడి తీసుకువస్తూ భూమిని ఖాళీ చేయిచాలని చూస్తున్నారని వాపోయారు. తమ పేరిట పట్టాదారు పాస్తుపుస్తకాలు ఉన్నాయని, ఏటా తామే వ్యవసాయం సాగుచేసుకుంటున్నామని పేర్కొన్నారు. రెవెన్యూ యంత్రాంగం విచారణ జరిపి తమకు అండగా నిలవాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా బాధితులు తెలుపుతున్న భూమి వెంకటాపురం శివారులోని సర్వే నంబర్ 313, 314లకు సంబంధించినదన్నారు. రంజిత్‌రెడ్డి తమకు సర్వేనంబర్ 315లో భూమి ఉన్నదని సర్వేకోసం దరఖాస్తు చేశారన్నారు. పూర్తిస్థాయి సర్వే, విచారణ జరిపిన అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.

## నాలుగు క్వింటాళ్ల బెల్లం స్వాధీనం

నల్లబెల్లి, అక్టోబర్ 7: టాస్క్‌ఫోర్‌ఎక్సైజ్, సివిల్ పోలీసులు తనిఖీలు చేసి నాలుగు క్వింటాళ్ల బెల్లం స్వాధీనం చేసుకొని, ఒకరిపై కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోవిందాపూర్ పంచాయతీ పరిధి బూల్యతండాకు చెందిన బానోత్ బిక్కూ రాత్రి వేళల్లో బెల్లం, పటికను భూపాలపల్లి, ములుగు జిల్లా కేంద్రాల నుంచి మూడుచెక్కలపల్లెకు తరలిస్తుండగా ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, నల్లబెల్లి పోలీసులు దాడి చేసి లక్ష్మీతండ సమీపంలో పట్టుకున్నారు. బైక్‌తో పాటు 4 క్వింటాళ్ల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తెలిపారు. బిక్కూను అదుపులోకి తీసుకుని పలువురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్‌ఎక్సైజ్ సీఐ రమేశ్‌చంద్ర, ఎస్సై ప్రశాంత్‌బాబు, పోలీసులు ఉన్నారు.

## కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి : నన్నపునేని

గిర్మాజీపేట, అక్టోబర్ 7: ఆరు గ్యారెంటీలతో పాటు రైతు, యూత్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ డిక్లరేషన్లపై దొంగ హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ నాయకులను కనబడినచోటే నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయకపోగా అవ్వాతాతల పింఛన్ పెంచలేదని మండిపడ్డారు. రైతు బంధును నిలిపివేశారని, రుణమాఫీ పూర్తి చేయలేదని, రైతుభరోసా పరిస్థితి కూడా అలాగే మారిందని దుయ్యబట్టారు. బోనస్‌ను బోగస్‌గా చేశారని, పది నెలలు గడిచినా రెండు లక్షల ఉద్యోగాలకు అతీగతి లేదని, నిరుద్యోగ భృతికి నీళ్లు వదిలారని పేర్కొన్నారు. ఈ దసరా పండుగకు ఊళ్లకు చేరుకుంటున్న కుటుంబ సభ్యులు, స్నేహితులతో కాంగ్రెస్ చేసిన మోసాలను చర్చించుకోవాలని కోరారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

గిర్మాజీపేట, అక్టోబర్ 7: వరంగల్ అండర్‌బ్రిడ్జి వద్ద 55 ఏండ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఇంతెజార్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు.

## ఇంతెజార్‌గంజ్ సీఐగా షుకూర్

గిర్మాజీపేట, అక్టోబర్ 7: హనుమకొండ జిల్లా ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎంఏ షుకూర్‌ను ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా బదిలీ చేస్తూ సోమవారం సీపీ అంబర్ కిషోర్‌ఝా ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ సీఐగా పనిచేసిన మచ్చ శివకుమార్‌ను వరంగల్ సీసీఎస్‌కు బదిలీ చేశారు.

## ఇల్లందలో పిల్లర్‌బాక్స్‌ల అపహరణ

వర్ధన్నపేట, అక్టోబర్ 7: మండలంలోని ఇల్లందలో 100 పిల్లర్ బాక్స్‌లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడు రాజు కథనం ప్రకారం.. గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద స్వగృహంలో పిల్లర్‌బాక్స్‌లు కిరాయికి ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం లేచి బయటకు వచ్చే సరికి ఇంటి ఎదుట ఉంచిన పిల్లర్‌బాక్స్‌లు కనబడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సెకండ్ ఎస్సై రాజు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## మృతురాలి కుటుంబానికి 'మార్నేని' పరామర్శ

రాయపర్తి, అక్టోబర్ 7: మండల కేంద్రానికి చెందిన ఆవుల కొమురయ్య తల్లి కేతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను సోమవారం వరంగల్ డీసీసీబీ, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట జాటోత్ హామ్యానాయక్, ఈదులకంటి రవీందర్‌రెడ్డి, భూక్యా సమ్మయ్య, మహ్మద్ మహమూద్‌పాషా, అఫ్రోజ్‌ఖాన్, కుంట రమేశ్, గుగులోత్ శ్రీనివాస్, మచ్చ రమేశ్ ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

ఖిలావరంగల్, అక్టోబర్ 7: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలైన ఘటన సోమవారం మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. ఏకశిలనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బండ గౌరీశంకర్ ఈనెల 2న రాత్రి 8:45 గంటలకు తన బైక్‌పై రంగశాయిపేటకు వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఢీకొట్టాడు. దీంతో గౌరీశంకర్ కాళ్లు, చేతులు, నడుముకు తీవ్ర గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

## బ్యాంకు సేవలపై అవగాహన ఉండాలి

గీసుగొండ, అక్టోబర్ 7: మండలంలోని నందనాయక్‌తండాలో సోమవారం బ్యాంకు సేవలు, పథకాలపై కొమ్మాల యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బ్యాంకు మేనేజర్ సర్వేశం మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి, ప్రధానమంత్రి జీవన్ సురక్ష పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకులో ఖాతాలు రెగ్యులర్‌గా ఉండేలా చూసుకోవాలన్నారు.

## యువసేన యూత్ అధ్యక్షుడిగా రాజశేఖర్

చెన్నారావుపేట, అక్టోబర్ 7: మండలంలోని ఖాదర్‌పేటలో యువసేన యూత్ నూతన అధ్యక్షుడిగా కూస రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూత్ సభ్యులు సోమవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా నల్ల గణేశ్, కార్యదర్శిగా కూస వెంకటేశ్, కోశాధికారిగా పెంతల రాజేశ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికలో యూత్ సభ్యులు రాజేశ్, సింగిరెడ్డి సురేశ్, ప్రవీణ్, అఖిల్, వైనాల సందీప్, శ్రావణ్, కృష్ణ పాల్గొన్నారు.